

ఆస్పత్రిలో ఆవరణలో అపరిశుభ్రత



జిల్లా కేంద్రంలోని జీజీహెచ్

# పెద్ద దవాఖానకు సుస్తీ!

- జీజీహెచ్‌లో నిర్లక్ష్యపు నీడలు
- చెత్తాచెదారంతో పేరుకుపోతున్న ప్రాంగణం
- బయోవేస్టేజీతో నిండిపోతున్న పరిసరాలు
- సమయపాలన పాటించని సిబ్బంది
- అస్తవ్యస్తంగా డైట్ నిర్వహణ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు తలమానికంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో నిర్లక్ష్యపు నీడలు కమ్ముకుంటున్నాయి. ఆధునిక యంత్రాలతో వైద్యం చేస్తున్నామని చెబుకుంటున్నా ఇక్కడి సమస్యలతో మాత్రం రోగులు సతమతమవుతున్నారు. ఆస్పత్రిలో ఆవరణలో చెత్తాచెదారంతోపాటు బయోవేస్టేజ్ పేరుకుపోతోంది. పిచ్చి మొక్కలు మొలుస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రి బాత్‌రూమ్‌లను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాస ఆ పరిసరాలంతా వ్యాపిస్తోందని రోగులు అంటున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారినపడి రోజుకు 400-500 మంది రోగులు జీజీహెచ్‌కు వస్తుంటారు. వీరిలో చాలా మంది పరిసరాలు పరిశుభ్రంగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి చుట్టూ వర్షపు నీరు చేరడంతో లోపలికి రావాలంటే నానాతంటాలు పడాల్సి వస్తోంది.

**నీటికి కటకట**

జీజీహెచ్‌లో తాగునీటి కటకట నెలకొనడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రికి ప్రతి రోజూ 35వేల నుంచి 40 వేల లీటర్ల వరకు తాగేందుకు, ఇతర పనులకు నీరు అవసరం ఉంటుంది. అయితే.. ఆస్పత్రి ఆవరణలో వేసిన బోర్లు నుంచి సరిపడా నీరు రావడం లేదు. అప్పుడప్పుడు మునిసిపాలిటీ ట్యాంకర్ల ద్వారా నీటి తెప్పిస్తున్నా సరిపోవడం లేదు. మిషన్‌భగీరథ ద్వారా రోజుకు 3 వేల లీటర్ల నీరు సరఫరా అవుతున్నా ఆస్పత్రి అవసరాలకు చాలడం లేదు. ఆస్పత్రిలో ఉన్న ఐదు బోర్లలో మూడు ఆస్పత్రి అవసరాలకు వాడుతుండగా రెండింటిలో ఒకటి ఆస్పత్రిపై నిర్మిస్తున్న అదనపు గదులకు, మరొకటి డాక్టర్ల క్వార్టర్స్ అవసరాలకు వినియోగిస్తున్నారు.

**రోగులకు నాసిరకం ఆహారం**

జీజీహెచ్‌లో రోగులకు ఉచితంగా అందిస్తున్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఉదయం 7 గంటలకు టిఫిన్, మధ్యాహ్నం ఒంటి గంటకు, రాత్రి 7 గంటల వరకు భోజనం అందిస్తారు. రోగులకు పోషక నిలువలతో కూడిన భోజనం అందించాల్సి ఉంటుంది. అయితే.. కాంట్రాక్టు సంస్థ రోగులకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నాసిరకం ఆహారం అందిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ జీజీహెచ్‌లో డైట్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జీజీహెచ్ డాక్టర్ భర్తే ఈ వ్యవహారం వెలగబెడుతుండటంతో నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డైట్ నిర్వహణకు ప్రభుత్వం ప్రతినెలా రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. అయితే.. కాంట్రాక్టర్ తీరుతో ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రి డైట్ అధ్వానంగా ఉంటుండటంతో ఆస్పత్రి వెలుపల ప్రొఫెసర్ జయశంకర్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న భోజనాన్ని రోగులు తెప్పించుకుంటున్నట్లు సమాచారం.

**సిబ్బంది ఇష్టారాజ్యం**

జీజీహెచ్‌లో మొత్తం 394 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో 41 మంది డాక్టర్లు, 202 మంది నర్సింగ్ స్టాఫ్, సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్ సిబ్బంది 63, పారామెడికల్ సిబ్బంది 24 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది సమయపాలన పాటించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్ సిబ్బంది ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిత్యం విధులకు గైర్హాజరవుతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు రోగుల నుంచి వసూళ్లకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. శానిటేషన్ పనులు చేయకుండా సిబ్బంది కాలక్షేపం చేస్తున్న ఫిర్యాదులు కోకొల్లలు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రినిలో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టాలని సర్వత్రా కోరుతున్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పోతుంది**

**- గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే**



జీజీహెచ్‌లో పారిశుధ్యం పూర్తిగా లోపించడంతో చెత్తాచెదారం పేరుపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో నిర్వహించే డైట్ నిర్వహణ పూర్తిగా నాసిరకంగా ఉంది. రోగులకు సమయానికి ఆహారం అందించడంలేదని నా దృష్టికి వచ్చింది. రాజకీయ ప్రోద్బలంతో జీజీహెచ్‌లో ఉద్యోగం పొందిన కొంత మంది పనిచేయకుండా వైద్యులనే బెదిరిస్తున్నట్లు తెలిసింది. అటువంటి వారిని తొలగించి ఆస్పత్రిని గాడీలో పెట్టాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉంది.



ఆస్పత్రిలో చెత్తాచెదారం



భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం గ్రామంలోకి చేరిన వరద

# భారీ వర్షం.. జలమయం

- గుల్లబుద్దారంలో ఉప్పొంగిన వాగు.. ఊర్లోకి వచ్చిన నీరు
- భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రి చుట్టూ చేరిన వర్షపు నీరు
- సింగరేణి ఓపెన్‌కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- మహాముత్తారం మండలంలో నిలిచిపోయిన రాకపోకలు



మహాముత్తారం సబ్ స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరద

కృష్ణకాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వాన పడింది. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 20.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మహదేవపూర్‌లో 13.8, పలిమెలలో 8.6, మహాముత్తారంలో 57.6, కాటారంలో 7.2 మల్హర్‌లో 9.4, చిట్యాలలో 22.4, టేకుమట్లలో 74.2, మొగుళ్లపల్లిలో 4.8, రేగొండలో 3.0, గణపురంలో 9.6, భూపాలపల్లిలో 18.4, కొత్తపల్లిగోరి మండలంలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు వివరించారు.

**గ్రామాన్ని చుట్టిముట్టిన వాన**

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో వచ్చిన వరద నీరు గొల్లబుద్దారం గ్రామాన్ని చుట్టిముట్టింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు విరామం లేకుండా వర్షం కురవడంతో గ్రామ సమీపంలో ఉన్న గద్దగుంటవాగు పొంగిపొర్లింది. గ్రామంలోని నూతన గుడి నుంచి పాఠశాల మీదుగా పోచమ్మ గుడి వరకు పూర్తిగా నీరు చేరింది. దీంతో గ్రామస్థులెవరూ బయటకు రాలేకపోయారు. వరద నీరంతా ప్రవాహంలా పాఠశాల ప్రాంగణంలోకి చేరింది.. అప్పటికే (మిగతా 8లో)

## అర్ధరాత్రి కుండపోత

- మూడు గంటల పాటు ఎడతెగని వాన
- అతలాకుతలమైన హనుమకొండ, వరంగల్ జిల్లాలు
- సంగెంలో అత్యధికంగా 202.7 మి.మీ. వర్షపాతం నమోదు
- స్తంభించిన జనజీవనం... నిలిచిపోయిన రాకపోకలు
- నగరంలో నీటమునిగిన తోతట్టు ప్రాంతాలు
- ఆకేరు వాగులో పశువుల కాపరి గల్లంతు
- కాశికుంటలో వరదనీటిలో మునిగి వృద్ధురాలి మృతి

8

# మద్యం మత్తులో బీభత్సం

- బైక్, చెట్టును ఢీకొన్న కారు డ్రైవర్
- అతడితోపాటు ఓ మహిళకు తీవ్రగాయాలు
- పరిస్థితి విషమం

మహదేవపూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ వీరంగం సృష్టించాడు. బైకును ఢీకొట్టిన అతడు కొద్దిదూరం వెళ్లాక చెట్టును ఢీకొన్నాడు. దీంతో అతడితోపాటు బైక్‌పై ఉన్న మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల కేంద్రంలోని నర్సరీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన సామ్యూ ల్ అనే డ్రైవరు ఓ వ్యక్తిని కారులో తీసుకొని కాళేశ్వరం వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడపల్లికి చెందిన రవీందర్, సుమలత దంపతులతోపాటు వారి కుమారుడు కృష్ణ మహదేవపూర్ సంతకు వస్తుండగా మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ సామ్యూల్ వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో సుమలతకు తీవ్ర గాయాలయ్యాయి. రవీందర్, అతడి కుమారుడు కృష్ణకు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని వేగంగా ఢీకొట్టిన కారు మహదేవపూర్ మండల కేంద్రంలోని నర్సరీ వద్దకు రాగానే ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ సామ్యూల్‌కు తీవ్రగాలయ్యాయి. కారులోనే ఉన్న మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రవీందర్ కుటుంబంతో పాటు డ్రైవర్ సామ్యూల్, మ రో వ్యక్తిని మహదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు. సామ్యూల్, సుమలత పరిస్థితి విష మించడంతో ఇద్దరిని భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



ఘటన స్థలంలో డ్రైవర్ సామ్యూల్

# రానున్న మూడు రోజులు జాగ్రత్త

- వర్షాలు కురిసే అవకాశం ఉంది
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదారాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణరావుతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌ను సీఎం నిర్వ హించారు. కలెక్టర్లతో మాట్లాడుతూ క్లౌడ్‌బరస్ట్ లాంటి ఘటనలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులు అలర్ట్‌గా ఉండాలని, తక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేయాలన్నారు. మూడు రోజుల పాటు అధికారుల సెల వులు రద్దు చేయాలన్నారు. వర్షాలపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. లో తట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముంపు గ్రామా ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పిడుగుపాటుకు ప శువులు మరణిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, బాధిత రైతులకు పరి హారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 2022లో జిల్లాలో మొరంచపల్లి వరద ముంపు ఘటనను ప్ర స్తవించారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.

**క్రైం కార్నర్**

వివాహిత ఆత్మహత్య కేసులో

## ఐదుగురి అరెస్టు

కాటారం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య కేసులో ఐదుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అత్తింటివారు వేధింపులకు గురిచేయడం వల్ల మండల కేంద్రంలో దుర్గం సరళ(30) శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని అందిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రెండు నెలల క్రితం సరళను ప్రేమ వివాహం చేసుకున్న జాడి రాజేష్‌తోపాటు అతడి తల్లిదండ్రులు జాడి శంకర్, లక్ష్మి, పిన్ని బాబాయ్‌లు జాడి తిరుపతి, గౌరు మానసికంగా వేధించారని, దీంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరుడు దుర్గం లక్ష్మణ్ ఫిర్యాదు చేసినట్టు ఎస్సై వివరించారు. దీంతో ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.

## హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితున్ని చూపిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం రూరల్ / కన్నాయిగూడెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యో తి): హత్య చేసులో నిందితుడిని అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్టు ఏటూరునా గారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మంగళవారం వారు ఈ వివరాలను వెల్లడించారు. తన బావను కూలి డబ్బులు అడిగాడనే కోపంతో కన్నా యిగూడెం మండలంలోని సర్వాయిలో రాజాబాబు అనే వ్యక్తిని కోరం రంజిత్ అనే వ్యక్తి శనివారం అర్ధరాత్రి కత్తితో పొడిచి హత్య చేశాడు. నిందితుడిని అరెస్టు చేసి, మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చినట్టు వివరించారు.

## బైక్ దొంగతనం కేసులో..

మొగుళ్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగతనం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు చిట్యాల సీఐ డి.మల్లేష్ తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నడికుడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన కంది నాగరాజు నెలరోజుల క్రితం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని రాయిశెట్టి లింగయ్యకు చెందిన ద్విచక్రవాహనాన్ని దొంగిలించాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా హనుమకొండ పట్టణంలోని డబ్బాల ప్రాంతంలో మరో వాహనాన్ని కూడా దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. రెండు బైకులను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. సమావేశంలో ఎస్సై అశోక్‌కుమార్, కానిస్టేబుళ్లు కృష్ణ, విజయ్‌లు పాల్గొన్నారు.

# ఓటు హక్కును దుర్వినియోగం చేస్తున్న బీజేపీ

**టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు**

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ ప్రజాస్వామిక దేశం అని, ఇక్కడ ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. అందుకు భిన్నంగా ఎన్నికల విధానాన్ని తప్పుల తడకగా మారుస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తుండగా సమాధానం చెప్పకపోవడం విడ్డూరమన్నారు. ఈ తప్పిదాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, నాయకులు దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్, అప్పం కిషన్, పద్మ, ముంజాల రవీందర్, రమేష్, సునిల్‌కుమార్, సహదేవ్, రమేష్, మహేందర్, రాజేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు మధు

# బీఆర్‌ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా



రాజీనామా లేఖతో బీఆర్ఎస్ నాయకులు

కాటారం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకాని గ్రామంలో పలువురు నాయకులు బీఆర్ఎస్‌కు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పార్టీ మండల ఇన్‌చార్జికి మంగళవారం లేఖ అందించారు. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన మండల మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మందల లక్ష్మారెడ్డికి మద్దతుగా క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కోసం అహర్నిషలు కష్టపడి పని చేశామని, ఎన్నో ఇబ్బందులు ఎదురైనా తట్టుకుని నిలబడ్డామని తెలిపారు. పార్టీకి రాజీనామా చేసినవారిలో మాజీ ఉప సర్పంచ్ అమృత సంతోష్, యూత్ మండల ఉపాధ్యక్షుడు చకినాల రాజయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు వేల్పుల రమేష్‌తో పాటు నిడిగొండ చెన్నకేశవ్, కొమురయ్య, పున్నంగౌడ్, రాజు, రాజయ్య, చంద్రయ్య, సలీమొద్దీన్, శేఖర్, వెంకటేష్, సమ్మయ్య, శ్రీనివాస్, భాస్కర్, సత్యం, శివప్రసాద్, రాకేష్, నర్సయ్య, రాజు తదితరులు ఉన్నారు.

## నేడు కాళేశ్వరాలయంలో మహాలింగార్చన

మహదేవపూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రావణమాసాన్ని పురస్కరించుకుని 365 మట్టి లింగాలతో అర్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో మహేష్ కోరారు.

# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

**సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి**



ప్రతిజ్ఞ చేయిస్తున్న సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్

కృష్ణకాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వరొరెడ్డి అన్నారు. కేటీకే 5ఇన్‌క్లైన్‌లో మంగళవారం జరిగిన మల్టీ డిపార్ట్‌మెంటల్ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, పని గంటలు పెంచుతూ ఎస్‌డీఎల్ యంత్రాలను నడపాలని, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని అన్నారు. ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి సంస్థను ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఈ సంవత్సరం తేనెటీగల పెంపకం గురించి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు మూడు కోర్సులు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కవీంద్ర, అధికారులు జ్యోతి, కల్తి రమేష్, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతితో పాటు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## జనక్ ప్రసాద్‌వి అర్థంలేని ఆరోపణలు

**హెచ్‌ఎంఎస్ బ్రాంచి సెక్రటరీ మల్లేష్**

కృష్ణకాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎంఎస్ యూనియన్, జాగృతి సంస్థలపై ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు అర్థంలేనివని హెచ్ఎంఎస్ బ్రాంచి సెక్రటరీ జూపెల్లి మల్లేష్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హకుల సాధన కోసం జాగృతి సంస్థ, హెచ్ఎంఎస్ యూనియన్ ఐక్య పోరాటాలు చేయడానికి నిర్ణయం తీసుకుంటే జనక్ ప్రసాద్ జీర్ణించుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. కారుణ్య నియామకాల ద్వారా అనేక మంది ఉద్యోగాలు పొందేలా జాగృతి అధ్యక్షురాలు కవిత ఎంతగానో కృషిచేశారని పేర్కొన్నారు. జనక్‌ప్రసాద్ అర్థంలేని ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.

# బీమాతో అన్నదాతకు ధీమా

- దరఖాస్తు చేసుకోవాలి
- మార్గదర్శకాలు విడుదల
- పరిహారం రైతుల ఖాతాల్లో జమ

తొర్రూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఆధారపడిన అన్నదాతల కుటుంబాలకు రైతు బీమా పథకం చేదోడుగా నిలుస్తుంది. ఇంటి పెద్దదిక్కు అకస్మాత్తుగా చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. ఏమి చేయలేని పరిస్థితిలో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడతారు. ఇలాంటి వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేస్తుంది. రూ.5 లక్షలు అందిస్తూ ఆసరాగా నిలుస్తుంది. 1966 నుంచి 2007 మధ్యలో పుట్టి 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న పట్టాదారులు ఇందుకు అర్హులు. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో కొత్తగా చేరేందుకు ఇటీవల పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 13లోగా దరఖాస్తు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 14వ తేదీ నుంచి బీమా పథకాన్ని రెన్యువల్ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డుతో వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తులు అందించాలి. రైతు కుటుంబాల్లో పెద్ద దిక్కుగా ఉన్నవారికి ప్రభుత్వం బీమా అమలు చేస్తుంది. ప్రమాదవశాత్తు రైతు మృతి చెందితే వ్యవసాయశాఖ అధికారులు వివరాలు సేకరించి పరిహారాన్ని ఖాతాల్లో జమ చేస్తున్నారు. రైతుల పేరిట ప్రభుత్వం ఎల్‌ఐసీకి ఇన్సూరెన్స్ చెల్లిస్తుంది.



తొర్రూరు రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవోలు

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వి.విజయచంద్ర, ఏడీఏ, మరిపెడ

రైతు బీమా పథకంలో చేరడానికి మంచి అవకాశం వచ్చింది. వ్యవసాయ విస్తరణ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 13వ తేది వరకు మాత్రమే గడువు. జిల్లా వ్యాప్తంగా కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు 8 వేల పైచిలుకు ఉన్నారు. వారిలో ఇప్పటివరకు 50శాతం మేర దరఖాస్తులు పూర్తయ్యాయి. మిగిలిన వారు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. రైతులు ముందుకు వచ్చి ప్రభుత్వం అందిస్తున్న బీమాను సద్వినియోగం చేసుకోవాలి.

### నిబంధనలు ఇలా..

లబ్ధిదారుడి వయసు పక్కాగా తెలుసుకునేందుకు ఆధార్ కార్డు ప్రామాణికం చేశారు. ఎన్నిచోట్ల భూమి ఉన్నా ఒక ఊరిలోనిది మాత్రమే బీమాకు అవకాశం ఉంటుంది. స్వయంగా బీమా ఫారాన్ని నింపి సంతకం చేసి తదితర వివరాలను వ్యవసాయశాఖ అధికారులకు అందించాలి. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. క్లస్టర్ కార్యాలయంలో ఏఈవోలు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందినవారే దరఖాస్తు చేసుకోవాలి. 59ఏళ్ల పైబడిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు ముందుకు రాకపోతే మళ్లీ ఏడాది వరకు వేచి చూడాల్సి ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

## ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర
- అధికారులతో సమీక్ష

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ లబ్ధిదారుల ఆధార్ అప్‌డేట్ అయ్యేలా సూపర్‌వైజర్లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీడీపీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, సూపర్‌వైజర్లు, ఆధార్ సెంటర్ నిర్వాహకులు, పోషణ్ అభియాన్ సిబ్బందితో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అంగన్‌వాడీ లబ్ధిదారులకు మూడు పని దినాల్లో సర్టిఫికెట్ జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, బిడ్డ పుట్టినప్పటి నుంచి సంవత్సరంలోపు పిల్లలకు డేట్‌ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్ కోసం ఎంపీవోలకు, ఏడాది తర్వాత తహసీల్దార్లను ఆశ్రయించాలని సూచించారు. ఈ-కేవైసీ ప్రక్రియ స్టేటస్ రోజువారీగా ఎన్ని దరఖాస్తులు క్లియర్ అయ్యాయో, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో అనే రిపోర్టు సమర్పించాలన్నారు. ఈ-కేవైసీ ప్రక్రియను త్వరగా ముగించి అంగన్‌వాడీ లబ్ధిదారులకు ఐసీడీఎస్ సేవలు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సీడీపీవోలు ప్రేమలత, శిరీష, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో చెక్‌పోస్ట్‌ల వద్ద ఫాస్ట్‌ట్రాక్‌ను ఎత్తివేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గోవిందరావుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా-ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఫాస్ట్‌ట్రాక్ పేరుతో వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లను నిలిపివేయడంతో పాటు అడవిలో ఉన్న రెండ చెక్‌పోస్టులను ఎత్తివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు ప్రైవేట్ వాహనదారుల నుంచి లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఏచట్ట ప్రకారం వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారో తెలుపాలని అన్నారు.

ఇప్పటికైనా పస్రా- ఏటూరునాగారం మధ్యలో ఉన్న రెండు చెక్‌పోస్టులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొదిళ్ల చిట్టిబాబు, తుమ్మల వెంకటరెడ్డి, నాయకులు తీగల ఆగిరెడ్డి, గొంది రాజేష్, క్యాతం సూర్యనారాయణ, ఐలయ్య, శ్రీను, కవిత, సువర్ణ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అడవులను సంరక్షించాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అడవిని ప్రతి ఒక్కరూ సంరక్షించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. అటవీ, రెవె న్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, పర్యాటక శాఖ అధికారులతో ఆయన కలెక్ట రేట్‌లో మంగళవారం సమావేశమయ్యారు. అడవి సంరక్షణ చర్యలపై సమీక్షించారు. జిల్లాలో అటవీ సంపద, వన్యప్రాణిసంరక్షణ, అడవి ఆక్రమణల నివారణ, ఎకో టూరిజం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై పటిష్ఠ పర్యవేక్షణ చేయాలన్నారు. ఇసుక రవాణా వల్ల అటవీ ప్రాంతానికి కలుగుతున్న నష్టాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పీ నవీన్ కుమార్, ఆర్‌అం డ్‌బీ ఈఈ రమేష్, పర్యాటన అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

### పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

భూపాలపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్ల పట్టిక, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన వ్యాక్సిన్లు, ఇతర మందులను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి ఉన్నారు.

## బైండోవర్ ఉల్లంఘన

రూ.50 వేల జరిమానా

కొత్తగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బైండోవర్ నియమాలు ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేలు జరిమానా విధించారు. గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొగుళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మూడుచెక్కల తండాకు చెందిన బానోత్ సమ్మయ్యను గుడుంబా విక్రయం కేసులో 2024 జూన్‌లో బైండోవర్ చేశారు. సమ్మయ్య బైండోవర్ నియమాలు ఉల్లంఘించి, గుడుంబా విక్రయించడంతో మంగళవారం తహసీల్దార్ రాజు ఎదుట ప్రవేశపెట్టారు. తహసీల్దారు సమ్మయ్యకు రూ, 50 వేలు జరిమానా విధించారు. సమ్మయ్య రూ.50 వేలు చాలన్ రూపంలో జరిమానా చెల్లించారు. ఈ సందర్భంగా సీఐ భిక్షపతి మాట్లాడుతూ గుడుంబా విక్రయించినా, గుడుంబా ముడి సరుకు బెల్లం, పటిక విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాజేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, బాలకృష్ణ, జాటోత్ కిశోర్, అభిలాష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాబోయే నాలుగు రోజుల్లో ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సూచించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరదలు ప్రభావితం చేసే అవకాశం ఉన్న ప్రాంతాలకు అనవసరమైన ప్రయాణాలు చేయవద్దని, అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని తెలిపారు. అత్యవసర సేవల సిబ్బంది తమ విధులను సమర్థంగా నిర్వహించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. వరదలు ఉన్న రోడ్లు లేదా వంతెనలను దాటే ప్రయత్నం చేయొద్దని, వరద నీటి లోతు, వేగం ఊహించిన దాని కంటే ప్రమాదకరంగా ఉండొచ్చని తెలిపారు.

## యూరియా కోసం బారులు



యూరియా బస్తాల కోసం బారులు తీరిన రైతులు

కాటారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం(పీఏసీఎస్) గోడౌన్ వద్ద యూరియా బస్తాల కోసం పలు గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం బారులు తీరారు. రెండు రోజుల క్రితం వచ్చిన 520 యూరియా బస్తాలు గోడౌన్‌లో ఉండగా రైతులు అక్కడికి చేరుకున్నారు. పీఏసీఎస్‌లో తక్కువ ధర ఉండటం, యూరియా బస్తాలకు కొరత ఉండటం, ప్రైవేట్ వ్యాపారులు ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు అమ్మడం, ఇతర ఎరువులు, పురుగుమందులతో లింక్ పెడుతుండటంతో రైతులు పీఏసీఎస్ వద్దనే యూరియా బస్తాలను కొనుగోలు చేస్తున్నారు.

## రైల్వేస్టేషన్లలో బాంబ్, డాగ్‌స్క్వాడ్ తనిఖీ

కేసముద్రం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం, ఇంటికన్నె రైల్వేస్టేషన్లలో మంగళవారం సాయంత్రం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు బాంబ్, డాగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీతో పాటు స్థానిక పోలీసులు తనిఖీ చేశారు. ఎస్ఐ మురళీధర్‌రాజ్, ట్రెయినీ ఎస్ఐ నరేష్ ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా కనిపించిన బ్యాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంతో పాటు గంజాయి రవాణాను నివారించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

## బుర్హాన్‌పురంలో చోరీ

6 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు అపహరణ

మరిపెడ రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు గుర్తు తెలియని దుండగులు దొంగిలించిన ఘటన సోమవారం అర్ధరాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బుర్హాన్‌పురంలో చోటు చేసుకుంది. ఎస్సై బొలగాని సతీష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుర్హాన్‌పురానికి చెందిన గడ్డం వెంకటరెడ్డి తన మనవరాలు అక్షరాభ్యాసానికి బాసరకు సోమవారం వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఆయన ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదును దొంగిలించారు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగలను వీలైనంత త్వరగా పట్టుకున్నామని ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి



జాటోత్ సుమన్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో టాటా ఏస్ డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం తొర్రూరులో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని వెలికట్టె శివారు పెద్దమంగ్య తండాకు చెందిన జాటోత్ సుమన్(28) కుటుంబీకులు తొర్రూరులో గృహ ప్రవేశం చేశారు. ఇంటికి విద్యుత్ దీపాలు అలంకరించారు. తెల్లవారు జామున విద్యుత్ దీపాల వైర్లు ఫెయిల్ కావడంతో మరమ్మతు చేస్తుండగా సుమన్ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గోపీచంద్ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో కూలీ..



బానోత్ వీరన్న (ఫైల్)

బయ్యారం (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందగా, మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గుతండాకు చెందిన బానోత్ వీరన్న (45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈనెల 3న వీరన్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు వీరన్నను చికిత్స నిమిత్తం తొలుత జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వీరన్న పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు ఈనెల 9న వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వీరన్న పరిస్థితి మరింత విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతునికి ఇరువురు పిల్లలున్నారు.

## ఘనంగా అంగారక సంకటహర చతుర్థి వేడుకలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



లక్షకు పైగా దూర్వా(గరిక)లతో రత్న కలశ గణపతి

కాటారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పలు ఆలయాల్లో అంగారక సంకటహర చతుర్థి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ధన్వాడలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో రత్నకలశ గణపతికి 1.25 లక్షల దూర్వా(గరిక)లతో ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడిని పూజిస్తే సంకటాలు తొలగిపోయి శుభం కలుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఏడాదిలో ఒకసారి మంగళవారం వచ్చే చతుర్థిని అంగారక సంకటహర చతుర్థిగా పాటిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు కృష్ణమోహన్‌శర్మ, ప్రవీణ్‌శర్మ సహస్రనామార్చన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

## ఐటీడీఏను ముట్టడించిన విద్యార్థులు

- మెస్ బిల్లులు చెల్లించాలని, బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్

ఏటూరునాగారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఐటీడీఏ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. గిరిజనుల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు చెల్లించాలని, బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వై-జంక్షన్ నుంచి ర్యాలీగా బయల్దేరిన విద్యార్థులు ఐటీడీఏ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. దీంతో ఎస్సై రాజకుమార్ తన సిబ్బంది కలిసి అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీడీ పోచంకు ఎస్ఎఫ్ఐ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా మెస్, కాస్మొటిక్ బిల్లులు విడుదల కాకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ వద్ద ఉన్న ఆభరణాలను తాకట్టు పెట్టి విద్యార్థులకు భోజనం పెడుతున్నారని, దీంతో వారికి ఆర్థిక భారం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు, సరైన మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు, ఫ్యాన్‌లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాగటి రవితేజ, టీఎల్. రవి, ఉపాధ్యక్షులు కోకిల బాలు, సహాయ కార్యదర్శి సోడి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

## బ్యాంకు రుణాల కోసం రైతుల నిరసన



రుణాల కోసం భూముల వద్ద నిరసన తెలుపుతున్న గిరిజన రైతులు

బయ్యారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గతంలో మాదిరిగానే తమకు బ్యాంకు రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పలువురు గిరిజన రైతులు తాము సాగు చేస్తున్న భూముల వద్దే మంగళవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బాధిత రైతులు వీరభద్రం, రాములు, లింగరాజు, శివలింగం, రామక్రిష్ణ, మహేష్, అంజనేయులు, శ్రీనివాస్, ఉప్పలయ్య, రాంబాబు, వెంకన్న తదితరులు తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారం మండలం ధర్మాపురం రెవెన్యూ విలేజ్ పరిధిలో సుమారు 200 మంది రైతులు 1970 నుంచి ప్రభుత్వ భూములు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే 2002-03లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ హయంలో భూ అభివృద్ధి పథకం కింద ప్రత్యేక నిధులు కేటాయించి భూములను సాగుకు ఉపయోగపడేలా అభివృద్ధి పరిచినట్లు వెల్లడించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో భూములకు హక్కులు కల్పించేలా 2005లో తీసుకొచ్చిన అటవీహక్కుల చట్టం ద్వారా ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతులకు రెవెన్యూ అసైండ్ పట్టాలు మంజూరు చేసినట్లు వివరించారు. తద్వారా రైతులు బ్యాంకుల్లో రుణాలు పొంది భూములు సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాటి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అసైండ్ పట్టాలు తొలగించి కొత్తగా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేసినప్పటినుంచి రుణాల సమస్య ఉత్పన్నమైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో డిజిటల్ పహాని బ్లాక్ చేయటంతో పాటు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలతో బ్యాంకుల్లో రుణాలు మంజూరుకాక రైతులు ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. దీంతో ప్రతి ఏడాది పంట సాగు చేయటం తమకు నరకయాతనగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను తొలగించి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన అసైండ్ పట్టాలనే మరల తిరిగి మంజూరు చేసి రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# నగరానికి వరద తాకిడి


వరంగల్ శివనగర్‌లో భారీగా నిలిచిన నీరు

## నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

- పలు కాలనీల్లో ఇళ్లలోకి వచ్చిన వర్షపు నీరు
- నగరంలో 5 చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- ఇప్పటికే 300 మంది తరలింపు, 1300 మందికి అల్పాహారం
- రక్షణ చర్యలు చేపడుతున్న నగర పాలక సంస్థ

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు వరద తాకిడికి గురయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఎడతెరిపిలేని కుండపోత వర్షానికి నగంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, షాపులు, ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 15 కాలనీలలో ఇళ్లలోకి వర్షపునీరు చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు.

### జీడబ్ల్యూఎంసీ చర్యలు

నగరంలో కురుస్తున్న వర్షాలకు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రజలకు సూచించారు. సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు నగరంలో చాలా కాలనీలతో పాటు ఇళ్లలోకి నీరు చేరడంతో కమిషనర్ అధికారులను అప్రమత్తం చేశారు. వరంగల్ కలెక్టర్ సత్యశారదదేవితో పాటు కమిషనర్ నగరంలో పర్యటించారు. శానిటేషన్‌తో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని పలు కాలనీలలో సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి ఆత్మస్థైర్యాన్ని నింపారు. సాయిగణేశ్ కాలనీ, డీకేనగర్, లెనిన్‌నగర్, అగర్తల చెరువు, మైసయ్యనగర్, గిరిప్రసాద్ కాలనీ, పద్మనగర్, శాకరాసికుంట ప్రాంతాల్లో కమిషనర్ స్వయంగా పర్యటించి వరద ముంపునకు గల కారణాలను తెలుసుకున్నారు.

మంగళ, బుధవారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రమాదపుటంచులో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇంకా పునరావాస కేంద్రాలలో అన్ని రకాల ముందులు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాకాలంలో పిల్లలు బయటకు, చేపలకు, ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నెంబర్‌కు 1800 425 1980, 9701999676 ఫోన్ చేయాలని కమిషనర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు సందర్శించిన వారిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సువర్ణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.




శివనగర్ రహదారిపై


మైసయ్యనగర్‌లో గుడిసేవాసులకు భోజనాలు అందజేస్తున్న కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్


వరంగల్ శివనగర్‌లో భారీగా నిలిచిన నీరు

### నీట మునిగిన ప్రాంతాలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరంగల్ నగరంలో పలు కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరినట్లు జీడబ్ల్యూఎంసీ అధికారులు గుర్తించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలైన హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు సాయిగణేశ్ కాలనీ, గాంధీ నగర్, డీకే నగర్, లెనిన్ నగర్, వివేకానంద కాలనీ, శివనగర్, ఎస్టీఆర్ నగర్, ఎంఎన్ నగర్, సీఎస్ఆర్ గార్డెన్, కొత్తబస్‌స్టేషన్, గోకుల్‌నగర్, శాంతినగర్, కాశిబుగ్గ, రంగశాయిపేట, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, బీకే నగర్, మైసయ్యనగర్, గోపాలపురం, తెలంగాణ జంక్షన్, రంగంపేట, ఎన్‌జీవోఎస్ కాలనీ, పోచమ్మకుంట, కొత్తవాడ, కాపువాడ, పాతబీటుబజార్, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, అండర్ రైల్వే గేట్ ప్రాంతాలతో పాటు పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో నీరు ఇండ్లలోకి చేరుకున్నాయి.

ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో జీడబ్ల్యూఎంసీ డీఆర్ఎఫ్, శానిటేషన్ సిబ్బంది స్పందించి నీటిలో చిక్కి ఉన్న వారిని గుర్తించి పునారావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటి వరకు సుమారు 300 మంది నిరాశ్రయులను కేంద్రాలకు తలించినట్లు సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి వెల్లడించారు. శంభునిపేట ప్రభుత్వ హైస్కూల్, బీరన్నకుంట హైస్కూల్, శుభం గార్డెన్, గుజరాత్ మార్వాడీ సెంటర్, శ్రీ రాజరాజేశ్వరి గార్డెన్ ఐదుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి నగర పాలక సంస్థ సహకారంతో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నారు. సోమవారం ఉదయం 1300 మందికి అల్పాహారం అందించినట్లు అధికారులు తెలిపారు.


ఖిలావరంగల్ శిల్పాలు, మధ్యకోటలోని స్వయంభూ దేవాలయంలో నిలిచిన వర్షంనీరు


హనుమకొండ బస్ స్టేషన్ ముందు పెరుకున్న కంకరతో ఇబ్బంది పడుతున్న ప్రజలు


జలమయమైన హంటర్‌రోడ్డు ఖమ్మం బ్రిడ్జి ప్రక్కన రైల్వే ట్రాక్ ప్రాంతం


అలుగు పోస్తున్న సంగెం మండలంలోని ఎల్గూరు చెరువు

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలన్నారు. ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగులు సెలవులు రద్దు చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, వైద్యారోగ్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే మూడు రోజులపాటు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

రానున్న 72 గంటలపాటు అవసరం ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని ప్రజలకు సూచించారు. పరిస్థితులను బట్టి పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలకు సెలవులపై తగు నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జనజీవనం స్తంభించిపోకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉంటున్న ప్రజలను వెంటనే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఖిలావరంగల్ స్వయంభూదేవాలయంలో నిలిచిన వర్షంనీరు


వరంగల్ కరీమాబాద్ చిన్న బ్రిడ్జి కింద నిల్చిన వర్షపు నీరు

## భూపాలపల్లి జిల్లాలో 20.8 మి.మీ వర్షపాతం

కృష్ణకాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో 20.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మహదేవపూర్‌లో 13.8, పలిమెలలో 8.6, మహముత్తారంలో 57.6, కాటారంలో 7.2 మల్హర్‌లో 9.4, చిట్యాలలో 22.4, టేకుమట్లలో 74.2, మొగుళ్లపల్లిలో 4.8, రేగొండలో 3.0, గణపురంలో 9.6, భూపాలపల్లిలో 18.4, కొత్తపల్లిగోరి మండలంలో 6.2 మి.మీ వర్షాపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



## ములుగు జిల్లాలో మోస్తారు వర్షం

ములుగు, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి) :ములుగుజిల్లా వ్యాప్తంగా మంగళవారం మోస్తారు వర్షం కురిసింది. జిల్లాలోని పలు మండలాల్లో స్వల్ప వర్ష పాతం నమోదైంది. ఏటూరునాగారంలో మండలంలో అత్యధికంగా 2.10 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ములుగులో 0.8 మి.మీ వర్షం కురిసింది. మంగపేటలో 19.3 మి.మీ, తాడ్వాయిలో 13.3 మి.మీ, వాజేడులో 11.8 మిమీ, గోవిందరావుపేటలో 10 మి.మీ, వెంకటాపురంలో 5.3 మి.మీ, వెంకటాపూర్‌లో 5.0 మి.మీ కన్నాయిగూడెంలో 3.5 మి.మీ, ములుగులో 2.3 మి.మీ, మల్లంపల్లిలో 1.0 మి.మీ వర్షం పడింది.

## మహబూబాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు

- పొంగుతున్న వాగులు.. పలు చోట్ల నిలిచిన రాకపోకలు
- పెద్దవంగరలో 120.8 మిలల్లీమీటర్ల భారీ వర్షం

మహబూబాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దంతాలపల్లి, పెద్దముప్పారం వద్ద పాలేరువాగు పొంగుతోంది. గార్ల మండలం పాకాల వాగు ప్రమాదస్థాయికి మించి ఉధృతంగా ప్రవహిస్తోంది. గూడూరు మండలం పాకాల వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తోంది. భీమునిపాదం జలపాతం జాలువారుతోంది. కేసముద్రం మండలం అర్పనపల్లి వద్ద వట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొత్తగూడ మండలంలో బూర్కవాగు, గాదెవాగు, గాంధీనగర్‌వాగులు, తొర్రూరు మండలంలోని గుర్తూరు-సోమారం మధ్య ఈదులకుంట వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వాగుల ఉధృతితో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు వాగులను దాటకుండా పోలీసులు ట్రాక్టర్లు, ముళ్లకంచెలు అడ్డుపెట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి ప్రాంతంలో 120.8 మిల్లీమీటర్ల అతిభారీ వర్షం కురిసింది. తొర్రూరులో 105.0 మిల్లీమీటర్ల భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 754.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 47.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


గూడూరు మండలంలో జాలువారుతున్న భీమునిపాదం


## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న 72 గంటల్లో భారీ వర్షాలు ఉన్నాయన్న నేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తరలిపోవాలన్నారు. అదే విధంగా శిథిలావస్థ భవనాలు, ఇళ్లలో నివసించే వ్యక్తులు సైతం సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసరం ఉంటేనే బయటికి రావాలన్నారు. వర్షంలో వాహనాలపై ప్రయాణించే వారు వాహనాల కండిషన్ చూసుకొని నిదానంగా డ్రైవింగ్ చేయాలన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద నిలబడటం, విద్యుత్ స్తంభాలను తాకడం చేయొద్దన్నారు. విపత్కర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## వాగులో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

- ప్రమాదవశాత్తు వాగులో పడిన వ్యక్తి
- జనగామ జిల్లా రఘునాథపల్లిలో ఘటన


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రఘునాథపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్ది నుంచి వచ్చే పెద్దవాగులో మండల కేంద్రంలోని రైల్వే ట్రాక్ సమీపంలోని చిన్న బ్రిడ్జి వద్దకు వరద నీటిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొని వచ్చిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రఘునాథపల్లి పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ గౌడ్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని, బయటకు తీశారు. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి, ఫ్రెంచ్ గడ్డంతో బక్క పలచగా ఉండి సిమెంటు రంగు ఆకుపచ్చని తీగల డిజైన్ ఫుల్ షర్టు, బెల్లం, నారింజ రంగు గళ్ల ప్యాంటు వేసుకొని ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతుడు ముస్లిం సామాజికి వర్గానికి చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. రెండు, మూడు రోజులుగా గ్రామాల్లో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం రాత్రి వెల్ది వాగులో ప్రమాదవశాత్తు పడి వరదకు కొట్టుకొని వచ్చినట్లు ఉందని పలువురు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

## విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల్లో ఉన్న విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఆయా జిల్లాల సూపరింటెండెంట్‌తో సీఎండీ మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధిగా హెడ్ క్వార్టర్‌లోనే ఉండి విధులు నిర్వర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ ఉండాలన్నారు. అంతరాయాలు ఏర్పడితే వెంటనే మెన్, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకొని వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. వర్షాలు ఉన్న నేపథ్యంలో సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. షిఫ్ట్ విధానంలో 24 గంటలు విధులు కేటాయించాలన్నారు. సీఎం ఆదేశానుసారం వరదల కారణంగా విద్యుత్ సరఫరా లేని చోట జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# దరఖాస్తులు అంతంతమాత్రమే!

- రైతు బీమాకు నేటితో ముగియనున్న గడువు
- జిల్లా వ్యాప్తంగా 86,736 మంది అన్నదాతలు
- కొత్తగా పట్టాలు పొందిన వారు 1,860 మంది
- బీమా పరిధిలో ఉన్నది 40,365 మంది
- ఇంకా దరఖాస్తు చేసుకోవాల్సింది 10,455 మంది

ములుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం పునరుద్ధరణకు గడువు బుధవారంతో ముగియనుంది. అయినా జిల్లాలో చాలా మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడం లేదు. ఈపథకంలో చేరిన రైతు ఆకస్మత్తుగా మరణిస్తే అ కుటుంబానికి రూ. 5లక్షల ఆర్థిక భరోసానిచ్చి ప్రభుత్వం ఆదుకుంటోంది. ఈ పథకంలో చేరని రైతు కుటుంబాలు పెద్ద మొత్తంలో నష్ట పోతున్నాయని తెలుస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు అర్హులైన రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ రైతులు దరఖాస్తు చేసుకోవడంలో పెద్దగా ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. అన్నదాతలు నిర్లక్ష్యం వీడి రైతు బీమా పథకంలో చేరితే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని, దానికి సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని అంటున్నారు.

### బీమా పరిధిలో 40,365 మంది రైతులు

జిల్లా వ్యాప్తంగా 86,736 మంది రైతులు ఉన్నారు. వీరిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 40,365 మంది అర్హులైన రైతులు ఈ పథకంలో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన వారిలో 18 సంవత్సరాల లోపు, 59 సంవత్సరాలు నిండిన వారు కొందరు ఉండగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోని వారు మరి కొందరు ఉన్నారని అంటున్నారు. అయితే.. కొందరు రైతులు అవగాహన లోపంతో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవడంలేదని తెలుస్తోంది.

రైతుబీమా
RYTHU BIMA
FARMER'S INSURANCE

### పథకానికి అర్హతలు ఇవే...

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాల్లో రైతు బీమా ఒకటి. పట్టా పాస్ పుస్తకం ఉండి, 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయసు కలిగి ఉన్న రైతులందరూ దీనికి అర్హులు. దరఖాస్తు ఫారంతో పట్టాపాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌ను జత చేసి సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

### కొత్తగా పట్టాలు పొందిన వారు..

ములుగు జిల్లాలో 10 మండలాలు ఉండగా మొత్తం 86,736 మంది రైతులు ఉన్నారు. వీరిలో 1,860 మంది ప్రభుత్వం నుంచి నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారి వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. ములుగు మండలంలో 361 మంది, వెంకటాపూర్ మండలంలో 308, జేడీ మల్లంపల్లి మండలంలో 200, ఏటూరునాగారం మండలంలో 17, తాడ్వాయి మండలంలో 58, గోవిందరావుపేట మండలంలో 74, మంగపేట మండలంలో 436, వెంకటాపురం మండలంలో 184, వాజేడు మండలంలో 193, కన్నాయి గూడెం మండలంలో 29 మంది నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలను పొందినట్లు అధికారులు వివరించారు. వీరు ఈ ఆర్థిక సంవత్సరంలో వీరు రైతు బీమా పథకంలోకి వస్తారని అంటున్నారు.

### ఇంకా మిగిలి ఉన్నది వీరే..

ములుగు జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో అన్ని అర్హతలు ఉండి 8,595 మంది రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే.. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెల 14 నుంచి మొదలు కానుంది. ఈ సంవత్సరం మరో 1,860 మంది రైతులు నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలను పొందారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 10,455 మంది రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుండగా 300-500 దరఖాస్తులు మాత్రమే తమకు అందాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

### అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి



రైతు బీమా పథకం అన్నదాత కుటుంబానికి ఎంతో ఉపయోగకరం. ఈ పథకం గురించి రైతులకు నేరుగా, వివిధ మాధ్యమాలు, ప్రజా ప్రతినిధుల ద్వారా, రైతు వేదికల వద్ద రైతు నేస్తం కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన రైతుల వివరాలను ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులకు ఇచ్చి వారికి తెలియజేయాలని చెబుతున్నాం. ఆ వివరాలను వాట్సాప్ గ్రూపుల్లో పంపిస్తున్నాం. అయినప్పటికీ చాలా మంది రైతులు దరఖాస్తు చేసుకోవడంలేదు. అర్హులైన ప్రతి ఒక్క రైతూ రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

- సురేష్‌కుమార్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్

కృష్ణకాలనీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. విద్యారంగంలో అనేక సమస్యలు కొట్టుమిట్టాడు తున్నా యన్నారు. కనీస వసతులు, సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల జోసెఫ్, పోతుల పవన్, కునూరి భగత్, రాజేష్, వాసం శరణ్య, లావణ్య, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య పోరాటంలో ఏఐఎస్ఎఫ్ పాత్రకీలకం

టేకుమట్ల, (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏఐఎస్ఎఫ్ పాత్ర కీలకమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రవీణ్ అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామంలో మండల అధ్యక్షుడు రత్న రమాకాంత్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్యవాదుల బానిస చేర నుంచి మాతృభూమికి విముక్తి కలిగించేందుకు పోరాటం చేసిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లద్దునూరి వంశీ, శ్రీకాంత్, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఓట్ల చోరీ అసత్య ప్రచారాన్ని మానుకోవాలి'

చిట్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఓట్ల చోరీ పేరుతో లోక్‌సభ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాహుల్‌గాంధీ, ఆపార్టీ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ అన్నారు. మండల కేం ద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడు తూ వెంకటేశ్ మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠ, ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. దేశ భద్రత, ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొస్తుంటే అడ్డుకోవాలని చూస్తే ఆ పార్టీకి ప్రజలే గుణపాఠం చెబుతారని విమర్శించారు.

### కాళేశ్వరాలయ అధికారి అవినీతిపై విచారణ

మహదేవపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి మంగళవారం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఈవో కార్యాలయంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే దేవాలయంలో పనిచేస్తున్న అధికారిపై వస్తున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆమె విచారణకు వచ్చారు. నివేదికను దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు అందిస్తామని, తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఆమె వెంట ఏసీ సునీత, స్థానిక ఈవో మహేష్, మాజీ దేవస్థాన చైర్మన్ మోహన్‌శర్మ ఉన్నారు.

### ఘనంగా మల్హార్ జయంతి వేడుకలు

మల్హర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్‌లో మంగళవారం మల్హర్‌రావు జయంతి వేడుకలను ఘనంగా బీఆర్ఎస్ నేతలు నిర్వహించారు. గ్రామంలోని మల్హర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### ఇసుక టిప్పర్, ఎక్స్‌కవేటర్ సీజ్

కాటారం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి జీపీ పరిధిలో సోమవారం అర్ధరాత్రి అక్రమ డంప్ నుంచి ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేసి వరంగల్‌కు తరలించే క్రమంలో ఇసుక టిప్పర్, ఎక్స్‌కవేటర్(జేసీబీ)ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఏఎస్సై సుధీర్ ఆధ్వర్యంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో మేడిపల్లి గ్రామానికి వెళ్తుండగా టిప్పర్‌లో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను లోడ్ చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. దీంతో భూపాలపల్లి మండలానికి చెందిన ఇసుక టిప్పర్‌తో పాటు ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి డ్రైవర్లతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అక్రమంగా ఇసుక తరలింపుపై టిప్పర్, ఎక్స్‌కవేటర్ డ్రైవర్లు సృజన్, సుమన్, ఓనర్లు భాస్కర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

### రైతులకు తప్పని కరెంట్ కష్టాలు : నాగజ్యోతి

తాడ్వాయి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనలో రైతులకు కరెంట్ కష్టాలు మొదలైయ్యాయని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని మేడారం పరిసర గ్రామాల్లో ఆమె మంగళవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యవసా యనికి 24 గంటల నాణ్యతమైన విద్యుత్‌ను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. సరైన వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి సందర్భాలు లేవన్నారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ అమలు చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన మంత్రి క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, తాడ్వాయి మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నాయకులు దుర్గం రమనయ్య, కోట సురేష్ గౌడ్, చల్లగొండ అశోక్ రెడ్డి, కోయలకుంట్ల ప్రసాద్, ఎడవెల్లి మధుసుదన్ రెడ్డి, సంకే ప్రణయ్, రాములు, గజ్జల రాంబాబు తదితరులు ఉన్నారు.

## భారీ వర్షం.. జలమయం

(5వ పేజీ తరువాయి)

చేరుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు అప్రమత్తం చేశారు. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి సురక్షితంగా ఇళ్లకు తీసుకెళ్లారు. మరోవైపు భూపాలపల్లి నుంచి రాంపూర్ మీదుగా అటవీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి పోవడంతో రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి.

### బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో భూపాలపల్లి సింగరేణి ఏరియాకు భారీ నష్టం కలిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు కురిసిన వర్షం కారణంగా ఓసీ-2, ఓసీ-3లోని బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. ఈ రెండు ఓసీల నుంచి కలిపి రోజుకు 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా 3 వేల టన్నులు మాత్రమే సాధ్యమైందని అధికారులు చెప్పారు. దీంతో రూ.3.50 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు.

### చెరువును తలపించిన జీజీహెచ్

భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) మంగళవారం కురిసిన భారీ వర్షానికి జలమయమైంది. వర్షపునీరు నిల్వడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మోకాలు లోతులో నీరు నిల్వడంతో చేసేదేమీ లేక అందులో నుంచే వెళ్లారు. ఆస్పత్రికి సరైన డ్రెయినేజ్ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది.. ఆస్పత్రిపై మూడో ఫ్లోర్ నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ జాగ్రత్తలు తీసుకోకపోవడంతో గైనిక్ వార్డ్ ఎదురుగా వర్షపు నీరు నిల్వడంతో గర్భిణులు ఇబ్బందులు పడ్డారు.

### నిలిచిన రాకపోకలు

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు ఉధృతమయ్యాయి. కాటారం-మేడారం రోడ్డులో కేశాపూర్ వద్ద లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. మండల కేంద్రానికి వచ్చే దారిలో సబ్ స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వ రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వర్షా కాలం మొదలైనప్పటి నుంచి భారీ వర్షం పడకపోవడంతో చెరువులు, కుంటల్లోకి పూర్తిగా నీరు చేరలేదు. మంగళవారం కురిసిన వర్షానికి చెరువుల్లోకి నీరు చేరి జలకళ సంతరించుకుంది.

### వాగులో కొట్టుకుపోయిన ఆటో

మహాముత్తారం మండల కేంద్రానికి సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టు వరద ఉధృతిలో ఆటో కొట్టుకుపోయింది. మంగళవారం రాత్రి 8:30 గంటలకు పలిమెల మండలం మోదెడు గ్రామం నుంచి మహాముత్తారం గ్రామంలోని తన అత్తగారింటికి ఆటోను నడిపించుకుంటూ వస్తున్న మేకల మధుకర్ వాగులో వరద ఉధృతిని అంచనా వేయలేకపోయాడు. ఆటోతో దాటే ప్రయత్నం చేయగా అది కొట్టుకుపోయింది. 'ఆటోను వదిలేసి ఈదుకుంటూ సురక్షితంగా అతడు ఒడ్డుకు చేరుకొన్నాడు. అక్కడే ఉన్న కొంత మంది గ్రామస్థులు అతడిని బంధువుల ఇంటికి చేర్చారు. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో మండలంలోని పెద్దవాగు, కోనంపేట వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

## అర్ధరాత్రి కుండపోత

### అతలాకుతలమైన హనుమకొండ, వరంగల్ జిల్లాలు



హంటర్ రోడ్‌లోని ఎన్‌టీఆర్ నగర్‌లో వరద నీరు

హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాలో సోమవారం రాత్రి వర్షం దంచికొట్టింది. మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన ఈ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రెండు జిల్లాల్లో అతి భారీ వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలో అత్యధికంగా 202.7 మి.మీ., హనుమకొండ జిల్లా కేంద్రంలో 113.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. అతిభారీ వర్షాలకు రెండు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. వరదలు భీభత్సం సృష్టించాయి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఆకేరువాగులో పశువుల కాపరి గల్లంతయ్యాడు. వరంగల్ నగరంలోని 41వ డివిజన్ కాశికుంట వాంబే కాలనీ పసునూటి బుచ్చమ్మ (73) వరదనీటిలో మునిగి మృతి చెందింది. ఇంట్లోకి పెద్దఎత్తున వరదనీరు ప్రవేశించి ఆమె నిద్రిస్తున్న మంచం మునిగిపోయింది. దీనితో ఊపిరాడక ప్రాణాలు విడిచింది. ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లిలో గోడకూలి ఐదు గొర్రెలు మృతి చెందాయి. వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ప్రైవేటు పక్షన్‌హాల్ ప్రహరీగోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ దుర్ఘటన జరిగే సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

### అతలాకుతలం

భారీ వర్షంతో వరంగల్‌లో పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరదనీరు నిలిచింది. అనేక ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. ఇంట్లోని వస్తువులు, నిత్యావసర వస్తువులు తడిసిముద్దయ్యాయి. వంటపాత్రాలు నీటిలో కొట్టుకుపోయాయి. మోకాలు ఎత్తువ వరకు ప్రవహించిన వరదనీటితో కొన్ని చోట్ల వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఇళ్ల మధ్య పెద్ద ఎత్తుననీరు నిలిచిపోవడంతో పలుకాలనీలు జల దిగ్బంధంలో మునిగిపోయాయి. ప్రజలు ఇళ్లలోనే చిక్కుకుపోయారు. వరదనీటి మట్టాలు అంతకంతకూ పెరిగిపోతుండడంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ గడిపారు. కొన్ని చోట్ల ప్రజలు ఇంటి డాబాలపైకి ఎక్కారు. కాలనీలన్నీ చెరువులను తలపింప చేశాయి. రోడ్లన్నీ మునిగిపోయిదారేతెన్నూ తెలియని పరిస్థితి ఏర్పడింది.

రాత్రంతా కుండపోతగా కురిసిన వర్షంతో తెల్లారేసరికి తమ ప్రాంతాలన్నీ చెరువులుగా మారడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎటుచూసినా వరదనీరే. ఇళ్లను చుట్టుముట్టడంతో బయట అడుగుపెట్టలేని దయనీయ స్థితి. దీనితో ఉదయం పాలు, ఇతర నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి కూడా వీలులేక పోయింది. గుడిసెవాసుల పరిస్థితి మరీ దారుణం. వరదనీటికి అనేక గుడిసెలు నీటమునగడంతో అన్నిటినీ వదిలేసి ప్రాణ భయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. వరంగ ల్‌లోని మురికివాడల వాసులు సాయం కోసం అర్థించారు. అతివృష్టికి రెండు జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లుతు న్నాయి. పలు చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. ప్రధాన రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపో యాయి. రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. పోలీసులు అప్రమత్తమై ఉధృతంగా ప్రవహిస్తున్న మత్తళ్లపై నుంచి ప్రజలు, వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. వరంగల్ నగరంలో లోతట్టు ప్రాంతాల ప్రజల్లో వరదనీటిలో చిక్కుకుపోయిన 300 మందిని డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు చేర్చాయి. వరద బాధితుల కోసం ఐదు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.

హనుమకొండ జిల్లాలో భారీ వర్షం కురిసింది. హనుమకొండ మండలంలో అత్యధికంగా 113.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లా సంగెం మండలంలో అత్యధికంగా 202.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలం చరిత్రలో ఇంత భారీ వర్షం పడడం ఇదే మొదటి సారి. దుగ్గొండి మండలం తిమ్మంపేట, నారాయణ తండా మధ్య కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నర్సంపేటలోని మాధన్నపేట చెరువు పెద్ద ఎత్తున మత్తడి పోస్తోంది. పర్వతగిరి మండలంలోని కొంకపాక శ్రీనగర్ క్రాస్‌రోడ్ల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై వర్షపు పెద్దఎత్తున ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరంగల్‌లోని మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ ప్రాంతం పూర్తిగా నీటమునిగింది. మిల్స్‌కాలనీ సీఐ రమేష్ సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కరీమాబాద్‌లోని రామలక్ష్మణ్ గార్డెన్ వద్ద ప్రహరీ కూలిపోయింది. అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని 32, 33, 39, 40 డివిజన్లలోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మత్తడిపోస్తున్న ఖిలా వరంగల్ అగర్తల చెరువును మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పరిశీలించారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లోకి పెద్ద ఎత్తున వరదనీరు ప్రవేశించింది. దీంతో పట్టాలు పూర్తిగా మునిగిపోయాయి.

## ఓసీ-3లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

గణపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరావుపల్లి ఓపెన్ కాస్టు-3లో బొగ్గు ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. మంగళవారం కురిసిన వర్షంతో ఓసీలో నీరు చేరడంతో బొగ్గు, ఓబీ పనులకు అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. మోటార్ల సహాయంతో ఎప్పటికప్పుడు నీటిని బయటకు పంపిస్తున్నామని అన్నారు. బొగ్గు ఉత్పత్తి నిలిచిపో వడంతో సుమారు 6వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ ఏర్పడిందని పేర్కొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన

వెంకటాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అభయమిత్ర కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో పోలీసులు మంగళవారం ప్రజలకు అవగాహన కల్పిచారు. పీఎస్సైలు తిరుపతిరెడ్డి, సాయికృష్ణలు సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశ్రమల గెజిట్ విడుదల చేయాలి

ములుగు టౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 2021 జూన్‌లో విడుదల చేసిన ఐదో షెడ్యూల్డ్ పరిశ్రమల జీవోలను యథాతథంగా గెజిట్ విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, నాయకులు లక్ష్మయ్య, మొగిళి, రమేష్, రాజు, రవీందర్, శివకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కన్నాయిగూడెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ సయ్యద్ సర్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు చేతుల మీదుగా తొమ్మిది మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా కార్యదర్శికి ఘన సన్మానం

వెంకటాపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ములుగు జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన తోట మల్లికార్జునరావుకు మంగళవారం వాడ బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్రా దామోదర్ ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. మల్లికార్జునరావు మండలం నుంచి పార్టీలో అంచలంచెలుగా ఎదుగుతూ మూడుసార్లు జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లి సూరిబాబు, సునీల్, దర్రా గోపి, మల్లయ్య, నాగార్జున, పానెం యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## కుల ధ్రువీకరణ పత్రంలో మార్పు

వెంకటాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో పలు మార్పులు చేసింది. మీ-సేవ కేంద్రం నుంచి కుల ధ్రువీకరణపత్రం పొందిన మరోసారి దరఖాస్తు చేసి కొత్తది పొందే అవకాశం గతంలో ఉండేది. ప్రస్తుతం కులం మారదు కనుక ఇప్పుడు పాత విధానానికి స్వస్తి పలకడంతోపాటు కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. కుల ధ్రువీకరణపత్రం గతంలో కమ్యూనిటీ బర్త్‌గా వచ్చేది. ప్రస్తుతం కుల ధ్రువీకరణపత్రంలో జనన వివరాలు అవసరంలేదని ప్రభుత్వం గుర్తించింది. పత్రంలో ఈ వివరాలను తొలగించి కేవలం కమ్యూనిటీ సర్టిఫికెట్ పేరుతో కొత్త ధ్రువీకరణపత్రాన్ని జారీ చేస్తోంది. కొత్తగా వచ్చిన మార్పులపై ప్రజలకు వివరిస్తున్నామని తహసీల్దార్ గిరిబాబు తెలిపారు.

## బైక్‌ను ఢీకొన్న కారు.. దంపతులకు గాయాలు

వాజేడు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం మండల కేంద్రంకు చెందిన కోగిల రాము, తులసి దంపతులు పని నిమిత్తం వాజేడుకు వస్తుండగా ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు ప్రగళ్లపల్లి వద్ద బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారులోనే క్షతగాత్రులను వెంకటాపు రం వైద్యశాలకు తరలించి చికిత్సను అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు భద్రాచలం తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఏటూరునాగారంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో బీజేపీ శ్రేణులు

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లంపల్లి మండలకేంద్రంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండిగ వెంకన్న ఆధ్వర్యంలో నాయకులు, పాఠశాల విద్యార్థులు మంగళవారంజాతీయ రహదారిపై హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులు కత్తి హరీష్, బాణాల రాజ్‌కుమార్, దొంతిరెడ్డి రాకేష్‌రెడ్డి, బండి బాబు, ప్రమోద్‌రెడ్డి, పోతరాజు రమేష్, బైకని మహేందర్, రాజు, చింతనిప్పుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

- వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ చమే నారాయణ్ తుకారం, ఇన్‌స్పెక్టర్ లాల్‌బాబు సింగ్, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ హాజరయ్యారు. దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రామరాజు, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పళ్ల బుచ్చయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.
- తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్, మండల ఇన్‌చార్జి పళ్ల బుచ్చయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకుల కృష్ణాకర్‌రావు, నాయకులు రాంబాబు, జనార్దన్, వెంకట్, ఓంప్రకాశ్(ఓంప్ర), సలేందర్, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.